బీసీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు మంగళవారం తెలిపారు. బీసీఏ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఫలితాల రివాల్యుయేషన్ దరఖాస్తులు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మూడేళ్ల ఫార్మ్ డీ, ఆరేళ్ల ఫార్మ్ డీ కోర్సులతో పాటు దూర విద్యా విధానంలో అందించే ఎంసీఏ కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 22వ తేదీ లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

పీఈఎఫ్ఐ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడిగా ప్రొ. సత్యనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 19: ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(పీఈఎఫ్ఐ)తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ వి. సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు ఆయనకు పీఈఎఫ్ఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ పియూష్ జైన్ నుంచి ప్రొఫెసర్ సత్యనారాయణ లేఖను అందుకున్నారు. ఆయన గతంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఫిజికల్ డైరెక్టర్, ఐయూటీ సెక్రెటరీ, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్, టీఎస్‌పీఈసెట్ కన్వీనర్ తదితర బాధ్యతలు నిర్వర్తించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తం కండి

ట్రైనింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

శిక్షణకు హాజరైన వివిధ శాఖల అధికారులు

- నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు
- అన్ని పార్టీల అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలి
- సీ-విజిల్‌లో ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో పరిష్కారం
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాలకు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలు

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ): ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాలు వారికి కేటాయించిన ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాల విధులు, బాధ్యతలు, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతరం తనిఖీ నిర్వహణ, ఈఎస్ఎంఎస్ అప్లికేషన్, సి-విజిల్ యాప్ తదితర అంశాలపై జిల్లా వ్యయ పరిశీలకులు శరత్‌చంద్ర అవగాహన కల్పించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని, అన్ని పార్టీలు అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం అప్రమత్తంగా ఉండి నిఘా పెట్టాలని జిల్లాలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మూడు షిఫ్టులలో 24 గంటల పాటు పనిచేసే విధంగా ఆయా నిఘా బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీటీజీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆదే విధంగా జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. వీటి ద్వారా నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సి-విజిల్ ద్వారా ఫిర్యాదులు అందిన 15 నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అక్కడికి చేరుకోవాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాల్లో వీడియో కవరేజి చేయాలని ప్రకాశ్‌రెడ్డి సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఈవీడీఎం డీఎస్పీ శ్రీనివాస్, సుదర్శన్, జిల్లా వ్యయ పరిశీలకులు నోడల్ అధికారి శరత్ చంద్ర, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు చేయాల్సిన విధులు, బాధ్యతలు, ఈఎస్ఎంఎస్ అప్లికేషన్, సి-విజిల్ యాప్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పించారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిద్దాం..!

అధికారులకు కలెక్టర్ సూచనలు

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం పార్లమెంటరీ నియోజకవర్గం నోడల్ అధికారులు, ఏఆర్‌ఓ డిప్యూటీ కమిషనర్లతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుందని తెలిపారు. ఏప్రిల్ 25న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ కాగా, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్‌కు అందరు అధికారులు సమయాత్తం కావాలని సూచించారు. ఎన్నికల విధులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నామినేషన్, మ్యాన్ పవర్, ట్రైనింగ్, మెటీరియల్, ట్రాన్స్‌పోర్ట్, టెక్నికల్, ఈవీఎం, ఎంసీసీ, ఎక్స్పెండిచర్ మేనేజ్మెంట్, పోస్టల్ బ్యాలెట్ పేపర్ అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఏఆర్ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు,కరెంట్, టాయిలెట్స్, కుర్చీలు, టేబుల్స్, లైటింగ్, సానిటేషన్ వసతుల ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సెగ్మెంట్ వారిగా నిరంతరాయంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల కల్లా నివేదిక పంపాలని తెలిపారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌కు కేంద్రం ప్రయత్నం

సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్,మార్చి19: సాంకేతికతను వినియోగించుకుని ఈవీఎం యంత్రాలను ట్యాంపరింగ్ చేసి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌తో మోదీ సర్కార్ కుమ్మక్కైందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ బద్ధంగా స్వతంత్ర హోదాతో కొనసాగే సంస్థలను మోదీ కలుషితం చేశారని, ఇందులో భాగంగానే ఎన్నికల కమిషన్‌ను సైతం గుప్పెట్లో పెట్టుకున్నాడని తెలిపారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయాలని కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్ అరుణ్ గోయల్‌పై ఒత్తిడి తీసుకురావడంతోనే ఆయన ఇటీవల రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఈవీఎంలతో పార్లమెంట్, ఏపీ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహిస్తే ప్రజలు వేసిన ఓటుకు విలువలేకుండాపోయే అవకాశం ఉందని, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానాన్ని తీసుకు రావాలన్నారు. అభివృద్ధి చెందిన యూరప్ లాంటి దేశాల్లో బ్యాలెట్‌తో ఎన్నికలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు షేక్ బాషా, బీరం సతీష్ కుమార్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, సభ్యుడు శంబురెడ్డి పాల్గొన్నారు.

ఓయూ ప్రతిష్టను దిగజారుస్తున్న వీసీపై చర్యలు తీసుకోవాలి

పైలాన్‌ను పరిశీలిస్తున్న విద్యార్థి నాయకులు

బహుజన విద్యార్థి సంఘాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 19: వందేళ్ల ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టను దిగజారుస్తున్న వీసీ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వందేళ్ల పైలాన్‌లో మద్యం సీసా బాటిల్‌ను పోలిన లోగోను ఉంచడంపై వారు మండిపడ్డారు. తక్షణమే ఆ లోగోను తొలగించాలని డిమాండ్ చేశారు. పైలాన్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం, విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీసీ పదవీ కాలం ముగుస్తున్న కొద్దీ హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందడి పెరిగిపోయిందని దుయ్యబట్టారు. వర్సిటీ ప్రయోజనాల సంగతిని పక్కకు పెట్టి వ్యక్తిగత ప్రయోజనాలే మిన్నగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అంబేద్కర్, భాస్కర్ కుమార్, సతీశ్, ఆనంద్, యుగంధర్, కృష్ణ, సూర్యం, తనిష్కు, సోనీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేల పటిష్ట నిఘా

- ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచండి
- సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, నియామవళిని ప్రతి ఒక్కరు పాటించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. నగర పోలీస్ సిబ్బందితో సీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందని, ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగదు, లిక్కర్, డ్రగ్స్ అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింతగా పెంచాలని, పెండింగ్‌లో ఉండే ఎన్‌బీడబ్ల్యూలు త్వరగా ఎగ్జిక్యూట్ చేయడంతో పాటు లైసెన్స్ ఆయుధాలను తీసికెళ్లడం లాంటి వాటిపై ఎన్నికల వరకు నిషేధం ఉందన్నారు. జిల్లా గ్రీవియన్స్ కమిటీ ఏర్పడిందన్నారు, తనిఖీలలో రూ.10 లక్షల కంటే ఎక్కువగా నగదుతో పట్టుబడితే ఆదాయ పన్ను శాఖకు తెలుపాలని సిబ్బందికి సూచించారు. నగరంలో 18 చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయని, ఆరు కంపెనీల సీఏపీఎఫ్, ఐదు సీఐఎస్, సీఆర్‌పీఫ్ బృందాలు విధులు నిర్వహిస్తున్నాయన్నారు. పాత నేరస్థులు, హిస్టరీ షీటర్, కమ్యూనల్ అఫెండర్స్ తదితర నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు.

మల్కాజిగిరికి ఓటింగ్ శాతం పెంచేలా..

2019లో జరిగిన మల్కాజిగిరి స్థానంలో 49.40 శాతం నమోదైన ఓటింగ్

మేడ్చల్, మార్చి 19(నమస్తే తెలంగాణ): దేశంలోనే ఓటర్ల సంఖ్యా పరంగా అతి పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్లను ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతులను చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోకి వచ్చే నియోజకవర్గాలలో ప్రత్యేక బృందాలను నియమించారు. గత పార్లమెంట్ ఎన్నికలలో ఓటింగ్ శాతం తగ్గిన ప్రాంతాలను గుర్తించిన బృందాలు, అక్కడ ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లకు ఓటు హక్కు, దాని విలువపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో 49.40 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైన క్రమంలో మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

టీ హబ్‌లో ఓజ్ సూపర్ యాప్ ఆవిష్కరణ

ఓజ్ సూపర్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న బీవీఆర్ మోహన్‌రెడ్డి, పాయల్ రాజ్‌పుత్

కొండాపూర్, మార్చి 19: విభిన్న రకాల సేవలను ఒకే ప్లాట్ ఫారమ్‌పై అందించేందుకు సరికొత్తగా రూపొందించిన ఓజ్ సూపర్ యాప్‌ను మంగళవారం నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో సెయింట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, సినీ నటి పాయల్ రాజ్‌పుత్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూపీఐ, గ్రాసరీస్, మెడిసిన్, క్యాబ్ సర్వీసెస్, సోషల్ నెట్‌వర్క్, ఫుడ్ డెలివరీ, హోటల్స్, ట్రావెల్స్, మూవీ తదితర సేవలన్నింటిని ఒకే యాప్ ద్వారా అందించడం ఎంతో సులభతరంగా ఉంటుందన్నారు. వినియోగదారులకు ఒకే ప్లాట్‌ఫారమ్ ద్వారా విభిన్న రకాల సేవలను అందిస్తున్న ఓజ్ సూపర్ యాప్ వ్యవస్థాపకులను అభినందించారు.

ఆ కూరగాయలు ప్రమాదకరం: హైకోర్టు

హైదరాబాద్, మార్చి 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో కాలుష్యమైన చెరువుల నీటితో ఆకు కూరలు, కూరగాయలను సాగు చేయడాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి కూరగాయల వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి, మార్కెట్‌లో అలాంటి కూరగాయల క్రయవిక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు జిల్లాల పరిధిలోని 13 చెరువుల దుస్థితిపై అడ్వొకేట్ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ అనిల్ కుమార్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది. చెరువుల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్, న్యాయవాది టి.శ్రీకాంత్ రెడ్డిలతో కూడిన అడ్వొకేట్ కమిషన్ నివేదిక ఇచ్చింది. రెండు జిల్లాల్లోని 13 చెరువుల వారీగా సమగ్ర నివేదిక అందజేసింది. చెరువుల ఆక్రమణలను తొలగించాలని, మురుగునీరు చేరకుండా చేయాలని, చెరువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువులకు ఫెన్సింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, పునరుద్ధరణ చర్యలు తీసుకుని వాటి ఫొటోలతో సహా ఏప్రిల్ 23లోగా కార్యాచరణ నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తా..

ఆకర్షణ సతీశ్‌తో ప్రధాని మోదీ

ప్రధాని మోదీ నుంచి పుస్తకాన్ని అందుకుంటున్న ఆకర్షణ

అమీర్‌పేట్, మార్చి19: తాను సేకరించిన పుస్తకాలతో 2024 చివరి నాటికి మొత్తం 25 గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తానని చెబుతున్న సనత్‌నగర్‌కు చెందిన ఆకర్షణ సతీష్‌ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. బేగంపేట్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆకర్షణ రెండేళ్లుగా తాను సేకరించిన దాదాపు ఏడువేల పుస్తకాలతో తెలంగాణలో ఏడు, తమిళనాడులో మూడు గ్రంథాలయాలను నెలకొల్పారు. ఈ విషయం తెలుసుకున్న ప్రధాని మోదీ ఇటీవల జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆకర్షణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ అభినందించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం నుంచి అందిన పిలుపు మేరకు 18వ తేదీ ఆదివారం సాయంత్రం కోయంబత్తూరు పర్యటనలో ప్రధాని మోదీ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తున్న ఆకర్షణ సతీష్‌ను రెండు నిమిషాలు కలుసుకునేందుకు అవకాశమిచ్చారు. ఊహించని విధంగా ప్రధాని మోదీ, ఆకర్షణల మధ్య దాదాపు 23 నిమిషాల పాటు సంభాషణ కొనసాగింది. త్వరలోనే తమిళనాడు కోయంబత్తూరు క్యాన్సర్ ఆసుపత్రి, తిరుపూరులో ఒక్కో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నానని, తెలంగాణలో 10 భరోసా సెంటర్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తానని, కొద్ది నెలల క్రితం నగరంలోని భరోసా సెంటర్‌లో ఒక గ్రంథాలయాన్ని అప్పటి మంత్రి హరీశ్ రావు ప్రారంభించారని, మిగిలిన 9 సెంటర్లలో గ్రంథాలయాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాల్సిందిగా కోరుతూ వుమెన్స్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయెల్‌కు లేఖ రాసినట్లు ప్రధానికి వివరించినట్లు తెలిపారు. 25 గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలన్న తన సంకల్పానికి ప్రధాని మోదీ తన వంతు వితరణగా 2 వేల పుస్తకాలను బహూకరించారని తెలిపారు. 25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తానని ప్రధాని మోదీ హామీ ఇస్తూ, తాను సంతకం చేసిన ఓ పుస్తకాన్ని అందించి ఆశీర్వదించినట్టు తెలిపారు.

నేడు టీ వర్క్స్‌లో హార్డ్‌వేర్ మీటప్

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ): టీ వర్క్స్‌లో హార్డ్‌వేర్ మీటప్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ హార్డ్‌వేర్ మీటప్(హెచ్‌హెచ్‌ఎం)పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం హార్డ్‌వేర్ రంగంలో ఆవిష్కరణలను చేసే వారిని ప్రోత్సహించేందుకు, అందరినీ ఒకే చోట చేర్చడం ద్వారా ప్రయోజనాలు పొందేలా ఉంటుందని తెలిపారు. భౌతిక ఆవిష్కరణలకు కేంద్రంగా ఉన్న టీ వర్క్స్ వేదికగా ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతోపాటు వాటి పనితీరును తెలియజేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. భౌతిక ఉత్పత్తులు తయారు చేస్తున్న ఔత్సాహికులు టీవర్క్స్‌ను సంప్రదించాలని, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు హార్డ్‌వేర్ మీటప్ ఉంటుందన్నారు.

తాగి.. బండరాయితో..

మెహిదీపట్నం మార్చి19: తాగిన మైకంలో ఓ వ్యక్తి తలపై బండరాయితో మోది హత్యాయత్నం చేసిన ఘటన హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి కలకలం రేపింది. పోలీసులు తెలిపిన ప్రకారం, మెహిదీపట్నం సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సమీపంలో పుట్‌పాత్‌పై గణేష్(45)అనే వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. మాసబ్ ట్యాంక్ పోచమ్మ బస్తీకి చెందిన రియాజ్ అహ్మద్ అలియాస్ చోటు (40) హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్ రౌడీషీటర్. మంగళవారం రాత్రి సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సమీపంలోని మిలటరీ గేట్ సమీపంలో గణేష్, చోటులు తాగిన మైకంలో గొడవపడ్డారు. ఈక్రమంలో చోటు బండరాయితో గణేష్ తలపై మోది హత్యాయత్నం చేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గణేష్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గణేష్ పరిస్థితి విషమంగా ఉందని, రౌడీషీటర్ చోటు కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఫాక్స్ సాగర్‌లో అక్రమ నిర్మాణాలు

- అలసత్వం వహిస్తున్న కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు
- సాగర్ స్థలాలను పరిరక్షించాలి: దూలపల్లి గ్రామస్తులు

దూలపల్లి సరిహద్దు ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ స్థలాల్లో అక్రమ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్, మార్చి 19:ఆక్రమణదారులు ప్రైవేట్ వ్యక్తుల స్థలాల జోలికి వెళ్లకుండా, ప్రభుత్వ ప్రాపర్టీలైన చెరువులు, కుంటల మీదకు దూసుకొస్తున్నారు. వీటిలో కబ్జాలకు పాల్పడితే అడిగేవాడు ఉండడన్న ఉత్సుకతలో అధికారులతో కుమ్మక్కై దురాక్రమణకు తెర లేపుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ, 132 జీడిమెట్ల డివిజన్ సరిహద్దుల్లో ఉన్న సర్వే నం: 124 గల ఫాక్స్‌సాగర్ ఎఫ్టీఎల్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో కొద్ది రోజుల నుంచి ఇరిగేషన్, రెవెన్యూతో పాటు కొంపల్లి మున్సిపాలిటీ అధికారుల కనుసన్నల్లో చెరువు స్థలాలకు రక్షణ లేకుండా పోతుందని, రోజురోజుకు చెరువు కుచించుకుపోతుందని దూలపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పలు విభాగాల చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు నిలయంగా మారింది. ఈ క్రమంలో వ్యాపార సముదాయాలకు అనువుగా ఉన్న ప్రదేశంలో కొంతమేరకు ప్రైవేట్ భూములు ఆనుకొని ఉండగా, దానికి అదనంగా ఫాక్స్‌సాగర్ చెరువు ఎఫ్టీఎల్ జోన్ కింద వచ్చే స్థలాల్లో ఆక్రమణదారులు తప్పుడు పత్రాలను సృష్టించి చెరువు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఒకవైపు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కొంపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన అధికారులు నిర్మాణాలను నిలిపివేయకపోగా, వాటిని ప్రోత్సహిస్తున్నట్టు దూలపల్లి గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాల వెనక అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేత దగ్గరుండి నిర్మాణాలు చేపిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరిని వివరణ కోరగా తమ సిబ్బందిని అక్కడికి పంపించి పనులను నిలిపివేయిస్తామని చెప్పడం గమనార్హం.

25వ తేదీ నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 19: ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 25వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ మంగళవారం తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు ఫోన్ నం.79899 03001లో సంప్రదించాలన్నారు.

22న షిప్పింగ్, లాజిస్టిక్స్‌పై అంతర్జాతీయ సదస్సు

మాదాపూర్, మార్చి 19: ఈ నెల 22వ తేదీన జరగనున్న షిప్పింగ్, లాజిస్టిక్స్ అంతర్జాతీయ సదస్సు - 2024కు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ వేదిక కానుంది. ఎంఎస్ఎంఈ మద్దతుతో జరగనున్న ఈ సదస్సు పరిశ్రమలో మెరుగైన లాజిస్టిక్స్ నిర్వహణను సులభతరం చేయడంలో వినూత్న ఆలోచనలను ఒకరి నుంచి మరొకరు పంచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తాజా పురోగతులు, సవాళ్ళు అవకాశాలను పరిశోధించడమే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ల్యాండ్ లాక్డ్ స్టేట్స్ నిర్దిష్ట లాజిస్టిక్స్ పరిమితులను ఎదుర్కొనేందుకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వే ప్రకారం, 2019తో పోల్చితే తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల నాణ్యత, టెర్మినల్, లాజిస్టిక్స్ ఖర్చు, నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్ లభ్యత వంటి పరిమితులతో ఒకటని చెప్పారు. తెలంగాణలో లాజిస్టిక్స్ విజయానికి సంబంధించిన కేస్ స్టడీస్, మల్టీ మోడల్ కనెక్టివిటీ కొరకు నేషనల్ మాస్టర్ ప్లాన్, కస్టమ్స్ సులభతర నిర్వహణ, కోల్డ్ చైన్ ఇన్‌ఫ్రా, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, అంతరాయాలలో వ్యవహరించడం, కేంద్ర, రాష్ట్ర విధి విధానాల నుంచి ప్రోత్సాహకాలను అర్థం చేసుకోవడం, ఓడరేవులకు మెరుగైన ప్రాముఖ్యతను సృష్టించడం, ఏ1, బ్లాక్ చైన్ మొదలైన తదుపరి తరం సాంకేతికతలను ప్రభావితం చేయడం వంటి అంశాలపై చర్చలు జరపనున్నట్లు తెలిపారు.

డిమాండు తట్టుకునేలా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

నార్సింగి సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్ ఏర్పాటు

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ): వేసవిలో విద్యుత్‌కు ఉండే డిమాండ్‌ను తట్టుకునేలా అవసరమైన ఏర్పాట్లు విద్యుత్ శాఖ అధికారులు చేస్తున్నారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నివాస ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలు, పరిశ్రమలు అధికంగా ఉండటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే వేసవి కార్యాచరణను అమలు చేస్తున్నారు. తాజాగా మంగళవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) పరిధిలోని సైబర్ సిటీ సర్కిల్‌లో ఉన్న నార్సింగి సబ్ స్టేషన్‌లో వేసవి డిమాండును తట్టుకునేందుకు 8ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అంతకు ముందు 5 ఎంవీఏల సామర్థ్యంతో పీటీఆర్ ఉండగా, దాన్ని పెంచుతూ కొత్త పీటీఆర్‌ను బిగించారు. దీంతో ఈ సబ్ స్టేషన్ పరిధిలోని నార్సింగి, గండిపేట, మంచిరేవుల ప్రాంతాలలోని సుమారు 5200మంది విద్యుత్ వినియోగదారులు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాను పొందుతారని, ప్రధానంగా నార్సింగి పరిధిలో ఉన్న హైరైజింగ్ బిల్డింగ్‌లకు, హెచ్‌టీ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని అధికారులు తెలిపారు.

జారిపడి ప్రమాదవశాత్తు ఒకరి మృతి

మూసాపేట్, మార్చి 19: ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం, వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన యశ్వంత్(20) కూకట్‌పల్లి పరిధి అల్విన్ కాలనీలో నివాసం ఉంటూ ఏసీ రిపేర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం అల్విన్ కాలనీలో నాలుగో అంతస్తులో ఏసీ సర్వీసింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. వెంటనే దగ్గరలో గల రాందేవ్ ఆస్పత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి కేసునను దర్యాప్తు చేస్తున్నారు.

పాతవారికి మొండిచేయేనా?

- కాంగ్రెస్‌లో కలవరం, మొదలైన వర్గ పోరు
- కొత్తవారిని రానియ్యొద్దంటూ రహస్య మంతనాలు
- రాజేంద్రనగర్‌లో భారీగా రాజకీయ సమీకరణలు

మణికొండ, మార్చి 19: రంగులు మారుస్తున్న ఊసరవెల్లుల్లా..ఒక పార్టీ నుంచి ఇంకొక పార్టీలోకి జంపింగ్ జపాంగులు వచ్చి చేరుతున్నారు. గత కొన్నేండ్లుగా పార్టీ జెండాలను, ఎజెండాలను, బడా నాయకులను మోస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఈ నేపథ్యంలో తమ ధోరణిని పార్టీ అధినాయకత్వానికి విరుద్ధంగా తీసుకుపోయేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎన్నో ఏండ్లుగా బోయిలై పల్లకీని మోస్తూనే ఉన్నాం.. ఎవ్వడో వచ్చి ఆ పల్లకీలో ఊరేగుతున్నాడు. ఇంక తమ వంతు వచ్చేదెన్నడు? అంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు విరుద్ధ భావాల్ని వ్యక్తపరుస్తున్నారు. అయితే, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కలవరం, వర్గపోరు మొదలైంది. పార్టీ అధికారంలోకి రాగానే పదేళ్ల పాటు పార్టీనే నమ్ముకుని నిరంతరం పనిచేసిన నాయకులు, కార్యకర్తలల్లో ఒక్కసారిగా ఆందోళనలు చోటుచేసుకుంది. ఇన్నాళ్లు పార్టీ పటిష్టత కోసం శ్రమించిన తమను అధిష్టానం పక్కకు నెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చేవారికి ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానం పలుకుతుండటంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు అయోమయానికి గురౌతున్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి అనుచర వర్గీయులంతా ఇప్పుడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి అధిష్టానం ఇచ్చే ప్రత్యేకతలను కల్పించకుండా, పాత వారికే ప్రాధాన్యత ఇచ్చేలా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ నేతలు కొంత మంది సోమవారం రెండు చోట్ల రహస్య సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించారు. ఇతర పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఏముందని? దశాబ్ద కాలంగా పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా అధిష్టానం చొరవచూపాలని వారు నిర్ణయించారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారంతా అవకాశవాదులేనని, వారికి ప్రాధాన్యత ఇస్తే తమ కార్యాచరణ నిర్ణయించుకోవాల్సి ఉంటుందని పరోక్షంగా పార్టీ పెద్దలతో వాపోయినట్లు తెలిసింది. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలలో కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి ఎలాంటి అవకాశాలు కల్పించొద్దని తేల్చి చెప్పినట్లు సమాచారం. ఇటీవల పార్టీలో చేరిన ఎంపీ రంజిత్‌రెడ్డి అనుచర వర్గానికి ఎలాంటి పదవులు కట్టబెట్టకుండా అధిష్టానం చొరవచూపాలని కొంతమంది నాయకులు కోరారు. పదేళ్ల పాటు ప్రతిపక్ష పార్టీలో కొనసాగి సొంత డబ్బులను ఖర్చుచేసిన పార్టీని బతికిస్తే ఇప్పుడు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలంతా కాంగ్రెస్‌లోకి వచ్చి చేరితే తమ పరిస్థితి ఏమిటని? వారు ప్రశ్నిస్తున్నారు. ఈసమయంలో పార్టీలు మారే వారంతా అవకాశవాదులేనని వారు స్పష్టం చేస్తున్నారు. ఎలాంటి పదవులను ఆశించకుండా కాంగ్రెస్ పార్టీలో చేరితే తమకేమీ అభ్యంతరం లేదని, కానీ, పదవులను ఆశించి పార్టీ మారితే మాత్రం వారికి ఎలాంటి అవకాశాలు ఇవ్వొద్దని తేల్చి చెప్పడంతో కొన్ని గ్రామాలల్లో వర్గ పోరు మొదలైనట్లు తెలుస్తుంది.